# సజావుగా ముగిసిన పోలింగ్

- 49 శాతం ఓటింగ్ నమోదు, ఓటేసిన 1,49,000 మంది..
- తగ్గిన ఓటింగ్ శాతంతో అభ్యర్థుల గుండెల్లో గుబులు



రాంనగర్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ నాయకులు నాగేశ్ ముదిరాజ్



మోహన్‌నగర్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



అడిక్‌మెట్‌లో ఓటు వేసిన మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు



మోహన్‌నగర్‌లో ఓట్లు వేసేందుకు బారులుతీరిన జనం

ముషీరాబాద్/కవాడిగూడ, నవంబర్ 30: ముషీరాబాద్ నియోజకవర్గంలో శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలోని రెండు మూడు చోట్ల ఈవీఎంల మొరాయింపు, స్వల్ప వాగ్వాదాల మినహా ఎన్నికల ప్రక్రియ గురువారం సజావుగా సాగింది. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. నియోజకవర్గంలోని మొత్తం 289 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ జరుగగా.. 49 శాతం ఓటింగ్ నమోదైంది. ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 3,01,788 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,55,168, మహిళలు1,46,607, ఇతరులు 13 మంది ఉన్నారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో ఎన్నికల నిర్వహణ(ఓటింగ్)కోసం 289 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 3,01,788 మంది ఓటర్లకు గాను దాదాపు లక్షా 49వేల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల అధికారులు ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి గంటల కొద్దీ వేచి చూడాల్సి వచ్చింది. మొత్తం మీద ముషీరాబాద్ నియోజకవర్గంలో ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల వరకు 4 శాతం ఓటింగ్ కాగా, 11 గంటలకు 10.54 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 17.38 శాతం ఓటింగ్ నమోదైంది. 3 గంటలకు 27.98 శాతం నమోదు కాగా, సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి 49 శాతం ఓటింగ్ నమోదైంది.

**పార్టీల నేతల ఓటు వినియోగం ఇలా..**

వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చిక్కడపల్లి కార్మికశాఖ కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, చిక్కడపల్లిలో బీజేపీ ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, రాంనగర్ జెవీ హైస్కూల్ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, గాంధీనగర్, ముషీరాబాద్‌లో మాజీ కార్పొరేటర్‌లు వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల భాగ్యలక్ష్మి హరిబాబు యాదవ్, ముఠా పద్మ, అఖిల్ హమ్మద్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత మున్సిపల్, శాసనసభ ఎన్నికల మాదిరిగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేకపోయారు. గత 2014 శాసన సభ ఎన్నికల్లో మొత్తం 150884 ఓట్లు పోలింగ్ నమోదుతో 54.9 శాతం ఓటింగ్ జరగగా, 2018 శాసన సభ ఎన్నికల్లో 140718 ఓట్లు పోల్ కాగా 51.34 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ సారి ఓటింగ్ శాతం మరింత తగ్గి లక్షా 49 వేల ఓట్ల నమోదుతో 49 శాతం ఓటింగ్ నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి 2.30 శాతం ఓటింగ్ తగ్గింది.

**ఓటేయడానికి ఆసక్తి చూపని జనం**

ప్రభుత్వం ఓటింగ్ శాతం పెంచడానికి ప్రసార మాధ్యమాల ద్వారా, ప్రజా ప్రతినిధులతో ప్రచారం చేసినా ఓటర్లు ముందుకురాలేకపోయారు. ఇక ఓటింగ్ పెంచడానికి, ప్రతి ఒక్కరు ఓటు వేసేలా గురువారం సెలవు దినంగా ప్రకటించినా ఓటర్లు మాత్రం ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపలేకపోయారు. ప్రధానంగా విద్యావంతులు, సంపన్న వర్గాల వారు పోలింగ్ కేంద్రాల వైపు కన్నెత్తి చూడలేకపోయారని చెప్పవచ్చు.

**కవాడిగూడలో...**

కవాడిగూడ, భోలక్‌పూర్ డివిజన్‌లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గాంధీనగర్ ఏసీపీ కందుల రవికుమార్, దోమలగూడ, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్‌లు దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నునావత్ రవిల నేతృత్వంలో పోలింగ్ బూతుల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ, తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం. రమేశ్‌రామ్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు వేసిన బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.రమేశ్‌రామ్ దంపతులు



దోమలగూడలో తమ ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ కుటుంబసభ్యులు



ఓటు హక్కు వినియోగించుకున్న తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి



కవాడిగూడలో ఓటు వేసిన స్థానిక కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ కుటుంబసభ్యులు వెంకటేశ్ తదితరులు

## ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభంజనం



ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 30 : ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ –2లో బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లో, రాష్ట్రంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అయ్యి చరిత్ర సృష్టిస్తారని ఆయనపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహా, రాకేశ్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మా, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠా నరేశ్, రాజేందర్, లక్ష్మి, ముఠా రామరాజ్,శివసింహ తదితరులు పాల్గొన్నారు.

❖ గాంధీనగర్‌లో డివిజన్, బాగ్‌లింగంపల్లి పోలింగ్ సెంటర్ 22లో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, భార్య వి.సమతారెడ్డి, తల్లి వి.లింగమ్మలతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాయకులు నాయిని దేవేందర్ రెడ్డి, నాయిని శిల్ప, రోహిత్‌కుమార్, సిరిగిరి శ్యామ్, సత్యనారాయణ, పాశం రవి, రాజేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




భార్య, తల్లితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు వి.శ్రీనివాస్ రెడ్డి



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగేశ్ ముదిరాజ్ తదితరులు



ఓటు హక్కు వినియోగించుకున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ దంపతులు



ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన వృద్ధురాలికి సాయం చేస్తున్న చిక్కడపల్లి సీఐ సీతయ్య